క్లుప్తంగా

బోధనలో మెళకువలు పాటించాలి



ఉదయగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు విద్యాబోధనలో మెళకువలు పాటించాలని ఎంఈఓ-1 టీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మాసాయిపేట మెయిన్, ఉర్దూ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. హెచ్ఎంలు అరుంధతి, హాజీర, ఉపాధ్యాయిని అనురాధ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోని దళితవాడ పాఠశాలలో ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని సహచర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఘనంగా సత్కరించారు. రామకృష్ణారెడ్డి దళితవాడ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై దుర్గంపల్లి పాఠశాలకు వెళ్లిన నేపథ్యంలో ఎంఈఓ టీ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సన్మానించి సేవలను కొనియాడారు. సయ్యద్ ఖలీం, షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన మహేశ్వరమ్మ

సీతారామపురం : మండలంలోని నాంచారమ్మపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు.. దేవమ్మచెరువుకు చెందిన యామనబోయిన శ్రీనివాసులు తన తల్లి మహేశ్వరమ్మతో కలిసి మోటార్‌సైకిల్‌పై సీతారామపురం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాంచారమ్మపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆరబెట్టిన మొక్కజొన్న కంకులపై టైరు జారి మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో మహేశ్వరమ్మ తలకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాసులు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మహేశ్వరమ్మను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



ఉదయగిరి: ఎవరైనా మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన, డ్రైవింగ్ లైసెన్సులు లేని, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంక్అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు బైక్‌లను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపఖజానా కార్యాలయంలో తనిఖీలు



ఉదయగిరి: స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ డీ గంగాద్రి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. పెన్షనర్లు, ఉద్యోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం డీడీని కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపఖజానా అధికారి ఉస్మాన్, సీనియర్ అకౌంటెంట్లు శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఆత్మకూరురూరల్: మహిమలూరులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌లో పీఎంజేజేబీవై పథకం కింద రూ.2 లక్షల బీమా చెక్కును లబ్ధిదారులకు బ్రాంచ్ మేనేజరు ఫిరోజ్‌కుమార్ గురువారం అందజేశారు. ఎస్ఎస్‌సీ అక్షరాస్యత కేంద్రం ప్రతినిధులతో పాటు ఆ సంస్థ కౌన్సిలర్ రాజేష్‌కుమార్, విజయ్‌కుమార్, పెంచలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

- చేపలను అక్రమంగా పట్టేందుకు తూముల ద్వారా విడుదల
- నీట మునిగిన పొలాలు
- వెన్నుదశలో 150 ఎకరాల్లోని పంట
- పంట దెబ్బతింటుందని రైతుల ఆందోళన

చేజర్ల పెద్దచెరువులోని

సాగునీరు వృథా



చెరువు తూము నుంచి వృథాగా పోతున్న సాగునీరు



వరి పొలంలో మోకాటిలోతున చేరిన నీటిని చూపుతున్న రైతు

చేజర్ల(ఆత్మకూరు): మండల కేంద్రమైన చేజర్లలోని పెద్ద చెరువు కింద చేజర్ల, మడపల్లి గ్రామాలకు సంబంధించి సుమారు 500 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ఈ ఏడాది సోమశిల జలాలను విడుదల చేయడంతో రైతులు 150 ఎకరాల్లో ఎడగారు పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట వెన్నుదశలో ఉంది. దీంతో చెరువు నుంచి పొలాలకు సాగునీటి విడుదలను నిలిపివేశారు. అయితే చెరువులోని చేపలను అక్రమంగా పట్టేందుకు కొందరు సాగునీటిని రెండ్రోజులుగా తూముల ద్వారా వృథాగా వదిలేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంట పొలాల్లో మోకాటి లోతున నీరు చేరడంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఎకరా సాగుకు రూ.20వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. సాగునీటి వృథాను కొనసాగిస్తే పంట పడిపోయి పాచిపోయి నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. చెరువు చేపల వేలం పాడుకున్న వారి గడువు ముగిసింది. అయినా కూడా అక్రమంగా చేపల వేట చేసేందుకు ఎంతో విలువైన సాగునీటిని వృథాగా వదిలివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి వృథాను అరికట్టి వరి పంట దెబ్బతినకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు



చేపలు సాగుదారులు రైతుల బాధలు పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. ఇష్టారాజ్యంగా చెరువులోని సాగునీటిని వృథాగా వదిలేస్తున్నారు. పంట వెన్నుదశలో ఉండగా నీటిని వదిలేయడంతో పొలాలు నీట మునిగాయి. ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీటి వృథాను అరికట్టి రైతులను ఆదుకోవాలి.
– యానాదయ్య, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, చేజర్ల

భూ సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న రైతులు

ఉదయగిరి: భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ బండగానిపల్లి పంచాయతీ పరిధిలోని రైతులు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ భూముల రీసర్వేలో పొరపాట్లు జరగడంతో వన్‌బీ, అడంగల్లు ఆన్‌లైన్‌లో రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కారణంగా రైతులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు చేయడం లేదన్నారు. రీసర్వేలో దొర్లిన పొరపాట్లను సరిచేయాలని రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. స్పందించిన తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ మాట్లాడుతూ రీసర్వేలో అన్యాయం జరిగిన రైతుల జాబితాను తనకు అందిస్తే పరిశీలించి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రీస్కూల్ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి



చిన్నారి బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ పుణ్యవతి

సీతారామపురం : అంగన్‌వాడీలు ప్రీస్కూల్ విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వై పుణ్యవతి అన్నారు. స్థానిక కోటవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతినెలా చిన్నారుల ఎత్తు, బరువులను కొలిచి పోషణ్ ట్రాకర్ యాప్‌తో పాటు రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. కేంద్రాల నిర్వహణలో సమయాన్ని పాటిస్తూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తూ హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ షేక్ షాను, యాక్టివ్ సూపర్‌వైజర్ రత్నమ్మ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



సీతారామపురం: కబడ్డీ ఆడుతున్న ఎంఈఓ



సంగం: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

సీతారామపురం : శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని ఎంఈఓ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ మస్తాన్‌వలి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను డివిజన్ స్థాయి, ఆ తరువాత జిల్లాస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఎంఈఓ-2 ప్రవీణ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బీవీ రమణయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్స్, తదితర పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులను వచ్చే నెల 8వ తేదీ ఆత్మకూరులో జరిగే డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఉదయగిరి: సంగం మండల పెరమన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. వరికుంటపాడు మండలం జంగంరెడ్డిపల్లికి చెందిన వారు ఉపాధి కోసం నెల్లూరు వెళ్లి స్థిరపడ్డారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న మేకపాటి జంగంరెడ్డిపల్లిలోని మృతుల బంధువులతో మాట్లాడి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఇసుక విధానంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ఢీకొని ఐదు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వ తప్పిదం ఉన్నందున విశాల దృక్పథంతో సీఎం ఆలోచించి రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వింజమూరు(ఉదయగిరి): ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి ప్రచారజాత గురువారం వింజమూరులో కొనసాగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు గడిచినా ఇంతవరకు పీఆర్‌సీ, డీఏ, ఐఆర్ ప్రకటించకపోవడంపై కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగులకు న్యాయం చేయకపోతే ఈ నెల 17వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి ఉద్యోగుల సత్తా చాటుతామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, నాయకులు శేషు, చలపతిశర్మ, వెంకటేశ్వర్లు, ఖాజావలి, బాలరాఘయ్య, చెంచలబాబు, యర్రా పరమేశ్వరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు విశేష పూజలు

ఉదయగిరి రూరల్: గండిపాళెం జలాశయం సమీపంలోని గంగమ్మ గుడిలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. వైస్ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి, గండిపాళెం మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య ఆధ్వర్యంలో గంగమ్మకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు గంధ మహోత్సవం

సీతారామపురం : స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలోని హజరత్ ఖాజా నాయబ్‌రసూల్ దర్గాలో 20వ గంధ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు గంధ మహోత్సవంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొని గంధం ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

నేడు, రేపు స్కూల్‌గేమ్స్ పోటీలు

దగదర్తి: మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను శుక్ర,శనివారాల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ భాస్కర్ గురువారం తెలిపారు. దగదర్తిలోని ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అండర్-14,17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, తదితర పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



వరికుంటపాడు:ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్యకార్యకర్తలు

సీతారామపురం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సీతారామపురంలోని బిట్-2 గ్రామ సచివాలయంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు స్వప్న, సాయినిఖిల్ మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ పుణ్యవతి, సూపర్‌వైజర్లు షాను, రత్నమ్మ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: బండగానపల్లెలో వైద్యాధికారిణి శివకల్పన ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 101 మంది మహిళలకు బీపీ, షుగర్, కేన్సర్, టీబీ, తదితర పరీక్షలు నిర్వహించారు.

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లిలో చాకలకొండ పీహెచ్‌సీ వైద్యులు మురళీధర్ మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వరికుంటపాడు: స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యులు అయేషా, సురేష్‌బాబు ప్రారంభించారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు టీ కళావతి గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.344

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు గరిష్టంగా రూ.344 ధర పలికింది. వేలానికి 730 బేళ్లు రాగా, 495 బేళ్లను విక్రయించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.344, కనిష్టంగా రూ.100, సగటున రూ.186.97 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.344 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 547 బేళ్లను తీసుకురాగా, 402 బేళ్లను విక్రయించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.344, కనిష్టంగా రూ.100, సగటున రూ.201.31 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఉదయగిరి రూరల్: ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో పంటలు సాగుచేసిన రైతులు ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ పీ చెన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నా, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం పొందాలన్నా, ఇతర వ్యవసాయ పథకాలను పొందాలన్నా ఈ పంట నమోదు అవసరమన్నారు. ఉదయగిరి మండలంలో ప్రధానంగా సజ్జ, మొక్కజొన్న, పసుపు, వరి పంటలను సుమారు 600 ఎకరాల్లో సాగుచేసి ఉన్నారన్నారు. రైతులు సమీప రైతుసేవా కేంద్రంలో వీఏఏలను కలిసి పంట వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

అన్నదానం

అనుమసముద్రంపేట: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానికుడు నాగూర్‌మీరా ఆధ్వర్యంలో హజరత్ ఖాజానాయబ్ రసూల్ వారి గంధ మహోత్సవానికి వచ్చిన దాదాపు 2వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

సొసైటీలో యూరియా పంపిణీ

కలిగిరి: స్థానిక పీఏసీఎస్‌లో రైతులకు యూరియా పంపిణీని పీఏసీఎస్ చైర్మన్ కదిరి వెంకటరంగారావు గురువారం ప్రారంభించారు. పీఏసీఎస్‌లో 13 టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. పీఏసీఎస్ డైరెక్టర్లు సోము భాస్కర్‌రెడ్డి, గన్నమనేని శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

ఆత్మకూరురూరల్: మండలంలోని ముస్తాపురంలోని రామాలయం వద్ద ప్రధాన నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు కుడుముల సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. స్థానిక నాయకులు కొల్లి శ్రీనివాసులు నాయుడు, ఆత్మకూరు సాగునీటి సంఘ ఉపాధ్యక్షుడు దేగా పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో భక్తజన సందడి



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గాలో భక్తజన సందడి నెలకొంది. గురువారం అర్ధరాత్రి గంధ మహోత్సవం జరగనున్న నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో దర్గా పరిసరాల్లో భక్తజన సందడి నెలకొంది. కాగా విద్యుద్దీప కాంతుల్లో దర్గా ప్రత్యేక శోభను సంతరించుకుంది.

డయల్ యువర్ డీఎంకు విజ్ఞప్తుల వెల్లువ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డిపోమేనేజర్ శివకేష్ యాదవ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు ఫోన్ ద్వారా పలు విజ్ఞప్తులు చేశారు. కరటంపాడు నుంచి అరవీడుకు అదనపు బస్సు నడపాలని, ఉదయగిరి డిపో బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చేలా చూడాలని, ఆత్మకూరు నుంచి అనంతసాగరానికి సాయంత్రం 4.30 నుంచి 8 గంటల మధ్యన బస్సు నడపాలని, అంతర్ జిల్లాల సర్వీసులను ఆత్మకూరు డిపో వరకు నడపాలని, అనంతసాగరం హైస్కూల్ వద్ద సాయంత్రం 4 గంటలకు బస్సు అందుబాటులో ఉంచాలని, ఆత్మకూరు నుంచి వింజమూరుకు సాయంత్రం 5 గంటల నుంచి బస్సులు అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన డీఎం సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసిస్టెంట్ డీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కలిగిరి: పొగాకు నారుమడుల సాగులో రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించాలని కలిగిరి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి శివకుమార్ అన్నారు. పొగాకుబోర్డు పరిధిలోని రాచవారిపల్లి, కమ్మవారిపాళెం, లక్ష్మీపురం గ్రామాల్లో పొగాకు నారుమడుల సాగును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడులను పోసే రైతులు పొగాకుబోర్డులో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే నారును విక్రయించాలని, ఇతరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రాధికారి ఎస్ సంతోష్‌కుమార్, క్షేత్ర సహాయకులు హజరత్‌బాబు, వెంకటేష్, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై బైఠాయించిన మహిళలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో నివాస ప్రాంతాలకు వెళ్లే రోడ్డు మార్గాన్ని అధికార పార్టీకి చెందిన ఓ నేత ఆక్రమించి రాకపోకలను అడ్డుకున్న విషయాన్ని అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని మహిళలు ఆరోపించారు. ఈ మేరకు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారి పక్కనే కొంత స్థలాన్ని పట్టణానికి చెందిన టీడీపీ నేత కొనుగోలు చేశారు. సదరు స్థలం పక్కనే సమీప నివాస ప్రాంతాల వారి రాకపోకలకు దారి ఉండేది. అయితే ఆపై దారి స్థలాన్ని సైతం తాను కొనుగోలు చేసిన స్థలంలో ఉందంటూ ఫెన్సింగ్ వేశారు. ఫలితంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు నెలలు గడుస్తున్నా, న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫెన్సింగ్ రాళ్లను తొలగించారు. దీనిపై పోలీసులకు స్థల యజమాని ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి ఏఎస్సై చేరుకుని ఫెన్సింగ్ తొలగించిన వారిని వారించారు. ఆగ్రహించిన మహిళలు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనను చేపట్టారు. ఫలితంగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కలిగిరి సీఐ వెంకటనారాయణ చేరుకొని మహిళలకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సీతారామపురం: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



కావలిలో ఐరన్ సిరప్‌ల పంపిణీ

కావలి(అల్లూరు): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా కావలిలోని బుడంగుంట గేట్, కచ్చేరిమిట్ట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుకూరలు, చిరుధాన్యాలు, తదితర పోషకాహారాలపై అవగాహన కల్పించారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు ఐరన్ సిరప్‌లను పంపిణీ చేశారు. ఏఎస్ఎం సుజాత, అంగన్‌వాడీలు విజయలక్ష్మి, శాంతి, ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: ఊబకాయంతో పిల్లల్లో అనేక సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. మండలంలోని ఇందుపూరు సచివాలయంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె పాల్గొన్నారు. పిల్లల్లో ఊబకాయం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఊబకాయం కలిగినవారు చక్కెర, నూనెలను ఏస్థాయిలో వాడాలో వివరించారు.

సీతారామపురం : స్థానిక ఎస్సీ కాలనీలోని బిట్-2 గ్రామ సచివాలయంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఉదయగిరి సీడీపీఓ వై పుణ్యవతి పాల్గొన్నారు. పోషకాహార ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. పిల్లల్లో స్థూలకాయ నివారణకు చక్కెర, నూనెల వాడకం తగ్గించాలని సూచించారు. అనంతరం బాల్య దశలో పిల్లల సంరక్షణ, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తయారీపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి స్వప్నరెడ్డి, వైద్యఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ,, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాముడూరు విద్యార్థుల ప్రతిభ



మధుప్రిహిషిత



జి గిరీష్

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం మాముడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీల్లో సత్తా చాటారు. అండర్-14 బాలికల విభాగంలో సీహెచ్ మధుప్రిహిషిత, అండర్-19 బాలుర విభాగంలో జీ గిరీష్ రాణించి జిల్లా జట్లకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు గురవయ్య పేర్కొన్నారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో జిల్లా తరపున పాల్గొనంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.